క్లుప్తంగా

అధినేతను కలిసిన అదీప్‌రాజ్



అధినేత జగన్‌తో అదీప్‌రాజ్

పెందుర్తి: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ బుధవారం తాడేపల్లిలోని అధినేత నివాసంలో కలిసి నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితిని వివరించారు. పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషిని, ప్రజల సమస్యలపై చేస్తున్న పోరాటాలను వివరించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్–2 అంతకాపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని 33/11 కేవీ అడిషన్ బ్రేకర్ నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 నుండి 1 గంట వరకూ అంతకాపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం, మొగలిపురం, బోదువలస, అయ్యన్నపాలెం, వంగలి, రాయపుర అగ్రహారం, టిక్కలిపాలెం, నాయనమ్మపాలెం, ఆరిపాక, గోటివాడ, పెదయాతపాలెం, బంగారమ్మపాలెం, అద్దూరు, ఎల్లుప్పి, లగిసెట్టిపాలెం, గాలిభీమవరం, చినయాతపాలెం, కిల్లివానిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ధారపాలెం ఫీడర్ పరిధిలో..

సింహాచలం: 11 కేవీ ధారపాలెం ఫీడర్ పరిధిలో శుక్రవారం నిర్వహణ పనుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. అడవివరంలోని కుమ్మరిదిబ్బ, పాత అడవివరం జంక్షన్, ధారపాలెం తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకి అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 10 మందికి కోర్టు రూ.10 వేలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలిపారు. బుధవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ట్రిపుల్ ఐటీకి 11 మంది ఎంపిక

పరవాడ: తానాం గ్రామంలోని ఎంజేపీబీసీ వెల్ఫేర్ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన 11 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ మాకిరెడ్డి సుహాసిని ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలకు చెందిన వి.వెంకటలక్ష్మి (నూజివీడు) జ్యోత్స్న (నూజివీడు) బి.భావన (నూజివీడు), కె.రాధిక (నూజివీడు), వి.రిషిత (నూజివీడు), ఐ.హిమశ్రీ(ఆర్.కె.వేలీ), ఎం.రెష్మాంజలి (శ్రీకాకుళం), పి.సాయిజీవని (శ్రీకాకుళం), కె.శ్రీవిద్య (శ్రీకాకుళం), కె.భావన (శ్రీకాకుళం), జి.హేమ హర్షిణి (శ్రీకాకుళం) క్యాంపస్‌కు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ సుహాసిని తెలిపారు.

కాలబైరవస్వామికి విశేష అభిషేకాలు



కాలబైరస్వామికి అభిషేకాలు చేస్తున్న భక్తులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబేకాలనీలోని శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని భైరవస్వామికి బుధవారం అభిషేకాలు చేశారు. అమావాస్యను పురస్కరించుకుని స్వామి వారికి భక్తులు పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు దొడ్డి రమణ, మంత్రి మంజుల, రాఘవేంద్ర స్వామి, జానకి, దేవి, పద్మ, హిమజ, అనిత, చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల వితరణ

అగనంపూడి: గుండెపోటుతో అనారోగ్యానికి గురై ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కె.శ్రీనివాసరావు కుటుంబానికి దువ్వాడ, రాజీవ్‌నగర్, కూర్మన్నపాలెం శిష్ట కరణ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకు సరిపడా బియ్యం, ఇతర నిత్యావసర సరకులు అందించారు. శ్రీనివాసరావు అసోసియేషన్‌లో చురుగ్గా సేవలు అందించేవారని, ఆయన అనారోగ్యంతో ఇంటికి పరిమితం కావడంతో బియ్యం, ఇతర వంట సామగ్రి అందించామని అసోసియేషన్ ప్రతినిధులు శేఖరమంత్రి శ్రీనివాసరావు, బి.వి.ఎం.కృష్ణ పేర్కొన్నారు.

అపారిశుధ్యంతో.. అవస్థలు



జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీ ప్రధాన కాలువలో పేరుకుపోయిన చెత్త

పరవాడ: మండలంలో పలు గ్రామాల ప్రజలు అపారిశుధ్య పరిస్థితుల మధ్య నివసిస్తూ అవస్థలు పడుతున్నా పంచాయతీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంతో ప్రజలు దోమలు, మురుగు కాలువలు వెదజల్లుతున్న దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నారు. వానా కాలం వచ్చేసింది. గత కొన్ని రోజుల నుంచి అడపా దడపా కురుస్తున్న వర్షాలతో చెత్తా చెదారాలు కాలువల్లో పేరుకుపోయి భరించలేని దుర్వాసన వెదజల్లడంతో పాటు విపరీతంగా పెరిగిన దోమలతో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు.

➜ గొర్లివానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్‌ఎం, టిడ్కో కాలనీ సముదాయాల్లో పారిశుధ్య పరిస్థితులు రోజుకి రోజుకి క్షీణిస్తున్నాయి. ఎక్కడ చూసినా చెత్త కుప్పలు పేరుకుపోయి ఉన్నాయి. కాలువల్లో చెత్త పేరుకుపోయి మురుగు పోయే పరిస్థితులు కనిపించడం లేదు. భరించలేని దుర్వాసన వస్తోంది. కాలనీ వాసులు ఇళ్లలో ఊడ్చిన చెత్తను రోడ్లపై పోస్తున్నారు. ఆ చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడానికి పంచాయతీ అధికారులు కనీస చర్యలు చేపట్టడంలేదు. చెత్త బండి కూడా రావడం లేదు. చీకటి పడితే దోమల బెడదతో కంటి మీద కునుకు లేకుండా పోతుంది. అనారోగ్యాల బారిన పడుతున్నామని కాలనీల ప్రజలు వాపోతున్నారు.

➜ దేశపాత్రునిపాలెంలో మురుగు కాలువల దుస్థితి అధ్వానంగా మారడంతో ఇబ్బందులు పడుతున్నా జీవీఎంసీ అధికారులు చోద్యం చూస్తున్నారంటూ ప్రజలు మండి పడుతున్నారు. యూనియన్ బ్యాంకుకు వెళ్లే రహదారిలో మురుగు నీరు ప్రవహించడానికి మార్గం లేక ఇళ్లలో ఉపయోగించిన వాడుక నీరు ఒక చోట చేరి చెరువును తలపిస్తోంది. దుర్వాసనతో బ్యాంకు రహదారిలో రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఎస్సీ కాలనీ రోడ్డు పక్కన అభివృద్ధికి నోచుకోని మురుగు కాలువ నుంచి భరించలేని దుర్వాసన వస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దోమల బెడద మరింత పెరిగిందని ఆందోళన చెందుతున్నారు.



దేశపాత్రునిపాలెం యూనియన్ బ్యాంకు రహదారిలో దుర్వాసన వెదజల్లుతున్న మురుగు గుంట



దేశపాత్రునిపాలెంలో అధ్వానంగా మారిన మురుగు కాలువ

➜ వాడచీపురుపల్లి గ్రామంలో నేస్తాలమ్మ సతకం పట్టు, పాత హాస్టల్, సాయిబాబా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో వాటిలోని చెత్తా చెదారం గాలికి ఎగిరి పరిసర ఇళ్లలో పడుతుండడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోజుల తరబడి చెత్త కుండీల నుంచి చెత్త తొలగించకపోవడం వల్ల తీవ్ర దుర్వాసనతో పాటు దోమలు విజృంభిస్తున్నాయి. చెత్త డబ్బాల నుంచి విడుదలవుతున్న దుర్వాసనతో ఇళ్లలో తిండి తినబుద్ధి కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. దోమల దాడులతో తరచూ అనారోగ్యాల బారిన పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు.

➜ గంగ పుత్రులు నివసిస్తున్న ముత్యాలమ్మపాలెంలో రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్త కుప్పల కారణంగా దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని చెబుతున్నారు. గ్రామంలో పలు మురుగు కాలువలు అధ్వానంగా ఉండడంతో మురుగు నీరు ప్రవహించడం లేదు. దిబ్బపాలెం–తంతడి రోడ్డులో పేరుకుపోయిన చెత్త కుప్పలు తొలగించడంలో పంచాయతీ అధికారులు శ్రద్ధ కనబర్చడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



వాడచీపురుపల్లి నేస్తాలమ్మ సతకం పట్టు వద్ద పేరుకుపోయిన చెత్త



ముత్యాలమ్మపాలెం–తంతడి రహదారిలో పేరుకుపోయిన చెత్త

చెత్తకుప్పలు తొలగించాలి..



రోడ్లపై పేరుకుపోయిన చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించాలి. కాలువల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాలను తొలగించి మురుగు సక్రమంగా ప్రవహించే విధంగా చూడాలి. కాలనీల్లోకి చెత్త బండి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి. చెత్త వల్ల దోమలు విజృంభించి అనారోగ్యాల పాలవుతున్నాం.

– బంగారమ్మ, గృహిణి, దిబ్బపాలెం

దోమల బెడద పెరిగింది..



రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్త చెదారాలతో దోమల బెడద పెరిగింది. విష జ్వరాల బారిన పడుతున్నాం. దోమల నివారణకు చర్యలు చేపట్టాలి. దిబ్బపాలెం–తంతడి రోడ్డులో పేరుపోయిన చెత్త కుప్పలను తక్షణమే తొలగించడానికి పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బంగారమ్మ, గృహిణి, టిడ్కో కాలనీ

తక్షణ చర్యలు తీసుకుంటాం..



గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న అపారిశుధ్య పరిస్థితులను మెరుగు పర్చడానికి తక్షణ చర్యలు తీసుకుంటాం. పంచాయతీ కార్యదర్శులను అప్రమత్తం చేస్తాం. చెత్త కుప్పలు, కాలువల్లో పూడికలు ఎప్పటికప్పుడు తొలగించేందుకు, దోమల నిర్మూలనకు చర్యలు చేపడతాం.

– వి.ధర్మారావు, మండల పంచాయతీ విస్తరణాధికారి, పరవాడ

తెరిపివ్వని వాన



ముత్యాలమ్మపాలెంలో తీరాన్ని తాకుతున్న అలలు



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం

పరవాడ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ముత్యాలమ్మపాలెం తీరంలో జోరుగా ఈదురు గాలులు వీస్తున్నాయి. సముద్రంలో ఆటుపోట్ల కారణంగా మత్స్యకారులు బుధవారం చేపల వేట మానుకుని ఇళ్లకే పరిమితమయ్యారు. ముందు జాగ్రత్త చర్యగా తెప్పలు, వలలు, ఇంజన్లను సురక్షిత ప్రాంతాలకు చేర్చి భద్రపర్చుకున్నారు. మండలంలో బుధవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. ప్రజలు గడప దాటి బయటికి రాకుండా ఇళ్లకే పరిమితమయ్యారు. ప్రయాణికులు లేక బస్సులు ఖాళీగా నడిచాయి. ఆటోలు స్టాండ్లకే పరిమితమయ్యాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ వరిలో దుక్కులు చేయడానికి ఉపయోగపడతాయని రైతులు చెబుతున్నారు. ఆకుమడులను సిద్ధం చేసుకోవడానికి ఈ వర్షాలు ఉపయోగపడతాయంటున్నారు. రబీలో వేసిన నువ్వు పంటలకు ప్రస్తుత వర్షం అనేక విధాలుగా సహాయపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో పలు చోట్ల వేసిన సరుగుడు, యూకలిప్టస్ పంటలకు మేలు జరుగుతుందని అన్నదాతలు పేర్కొంటున్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పరిశీలన



చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి తదితరులు

సబ్బవరం: మండలంలోని అసకపల్లి, ఆరిపాక గ్రామాల్లో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను జెడ్పీ సీఈవో పి. నారాయణమూర్తి బుధవారం పరిశీలించారు. ఆయా కేంద్రాల్లోని ఘన వ్యర్థాల నిర్వహణ తీరుపై ఆయన అధికారులను ఆరా తీశారు. పరిసరాల శుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి. పద్మజ, అసకపల్లి సర్పంచ్ కర్రి నర్సింగరావు, ఈవోపీఆర్‌డీ బి. చైతన్య. పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

రక్తదాన శిబిరానికి చక్కటి స్పందన



రక్త దాతలకు బహుమతులు అందజేస్తున్న పైలా ప్రసాదరావు

సబ్బవరం: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సబ్బవరం శాఖలో నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. భారతీయ స్టేట్ బ్యాంక్ 70 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చైర్మన్ శ్రీనివాస శెట్టి పిలుపు మేరకు 70 వేల యూనిట్ల రక్త సేకరణలో భాగంగా నిర్వహించిన శిబిరంలో బ్యాంక్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, ఖాతాదారులు రక్తదానం చేశారు. అమరావతి సర్కిల్, రాజమహేంద్రవరం మాడ్యూల్, అనకాపల్లి రీజియన్ సబ్బవరంలో అనకాపల్లి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మహాపాత్రు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ రీజినల్ సెక్రటరీ పైలా ప్రసాదరావు శిబిరాన్ని ప్రారంభించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ జనరల్ సెక్రటరీ ఎల్. చంద్రశేఖర్ సూచనల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పైలా ప్రసాదరావు తెలిపారు. దాతలకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రోత్సాహక బహుమతులు అందజేసింది. ఈ కార్యక్రమంలో నాయకులు, స్టేట్ బ్యాంకు ఖాతాదారులు బలిరెడ్డి అప్పారావు, బోకం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ అరెస్టు

పరవాడ: లంకెలపాలెం కూడలిలో ఈ నెల 23న జరిగిన రోడ్డు ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. అతనిది తెలంగాణ రాష్ట్రంలోని సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలం మట్టంపల్లి గ్రామం అని, అతను లక్కిరెడ్డి కోటిరెడ్డి అని చెప్పారు. లారీని అధికవేగంతో నిర్లక్ష్యంగా నడిపి లంకెలపాలెం ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఆగి ఉన్న వాహనాలను ఢీకొట్టడంతో ముగ్గురు వ్యక్తులు మృతి చెందగా మరి కొంత మంది తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను విశాఖ సెంట్రల్‌కు తరలించామన్నారు. ఈ సందర్భంగా సీఐ మల్లికార్జునరావు వాహనదారులకు పలు సూచనలు చేశారు. వాహనాల్లో ఓవర్ లోడింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు పెనాల్టీ వసూలు చేస్తామన్నారు. వాహనాల మెయింటెనెన్స్ ఎప్పటికప్పుడు చూస్తుండాలి. బ్రేకులు, టైర్లు, లైటింగ్ వ్యవస్థ పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలి. వాహనాలను అధిక వేగంగా నిర్లక్ష్యంతో నడపడం చట్టరీత్యా నేరమన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహన యజమానులపై చర్యలు తప్పవన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్య కల్యాణంలో యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం, అక్షింతలు అందజేశారు.

వైభవంగా గరుడసేవ..

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం గరుడసేవ వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని గరుడ వాహనంపై అధిష్ఠింపజేశారు. అష్టోత్తర శత నామావాళి పూజ నిర్వహించారు. విశేషంగా హారతి అందజేశారు. భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు.

ఎమర్జెన్సీతో తీరని నష్టం



నారాయణరావును సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

గాజువాక: ఎమర్జెన్సీ కాలంలో జైలు శిక్ష అనుభవించిన సుంకర నారాయణరావును బీజేపీ నాయకులు సత్కరించారు. గాజువాక బీజేపీ నాయకులు బుధవారం ఎమర్జెన్సీ వ్యతిరేక దినం నిర్వహించారు. ఆ పార్టీ నాయకుడు కరణంరెడ్డి నర్సింగరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎమర్జెన్సీ అమలు చేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందన్నారు. ఇందిరా గాంధీ హయాంలో అన్ని వ్యవస్థలు దగా పడ్డాయన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రతి పౌరుడికీ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం వచ్చాయన్నారు. కార్యక్రమంలో నాయకులు దీనంకొండ కృష్ణంరాజు, బొండా ఎల్లాజీరావు, బాటా శ్రీనివాస్, గూటూరు శంకరరావు, శశిధరణ్‌పిళ్లై, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అత్యుత్తమ కళాశాలగా పెందుర్తి పాలిటెక్నిక్



పెందుర్తి: సాంకేతిక విద్యా విభాగంలో 2024లో అన్ని విభాగాల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచిన కళాశాలగా పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ఎంపికైంది. ఆగస్టు 13, 14 తేదీల్లో మదనపల్లిలో జరగనున్న కార్యక్రమంలో 'బెస్ట్ పాలిటెక్నిక్ హావింగ్ బెస్ట్ ఓవరాల్ పెర్ఫార్మెన్స్–24'అవార్డును ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ అందుకోనున్నారు. ఈ మేరకు ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర కార్యదర్శి ఆచార్య బి.ఈశ్వర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాల గత కొన్నేళ్లుగా అత్యున్నత ప్రమాణాలతో సాంకేతిక విద్యను అందిస్తోంది. కళాశాలలో విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు ఉన్నాయి. దీంతో విద్యార్థులంతా తమలోని సృజనాత్మకతను వెలికి తీస్తున్నారు. ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అన్ని విభాగాల్లోనూ ముందంజ వేస్తున్నారు. అదే సమయంలో రికార్డు స్థాయిలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించి కళాశాల ప్రాంగణం నుంచే విద్యార్థులు ఉద్యోగాలు పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ ప్రతిభా అవార్డుకు కళాశాల ఎంపిక కావడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

విద్యార్థుల తల్లులకు.. చేరువ కాని తల్లికి వందనం

అర్హతలున్నా అందలేదు..



మండలంలోని బంగారమ్మపాలెం శివారు ఏ శిరసపల్లి గ్రామం మాది. నా పేరు సమ్మంగి అప్పలకొండ. నా భర్త సమ్మంగి అప్పలస్వామి. లారీ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నేను గృహిణిని. నాకు ఒక కుమార్తె, కుమారుడు. కుమార్తె సమ్మంగి జ్యోత్స్న సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరంలో ప్రవేశించింది. కుమారుడు సమ్మంగి జశ్వంత్ గోపాలపట్నంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ప్రథమ చదువుతున్నాడు. మా పిల్లలిద్దరికీ అన్ని అర్హతలు ఉండడంతో తల్లికి వందనం పథకం ద్వారా వచ్చే మొత్తం మా బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని చూసాం. మిగిలిన వారందరికీ జమ అయినప్పటికీ మాకు రాకపోవడంతో బ్యాంకులు, సచివాలయాల చుట్టూ తిరిగితే విద్యుత్ వినియోగం 300 యూనిట్లు వాడటంతో అనర్హులుగా తెలిపారు. దీంతో విద్యుత్ కార్యాలయాల చుట్టూ తిరిగి వాకబు చేయడంతో విద్యుత్ వినియోగం ఇప్పటి వరకూ ఏ ఒక్క నెల కనీసం 150 యూనిట్లు కూడా దాటలేదన్నారు. దీంతో విద్యుత్ అధికారుల నుండి ధ్రువీకరణ పత్రాలు తీసుకుని ఫిర్యాదు చేసేందుకు మూడు రోజులుగా తిరుగుతున్నాం. గడువు ముగుస్తుండటంతో తల్లికి వందనం మాకు అందుతుందో లేదో అని ఆందోళనగా ఉంది.

ఇంకా ప్రాసెస్‌లో ఉందంటున్నారు..

నా పేరు గొంప కుమారి. గృహిణిని. మా స్వగ్రామం మండలంలోని రాయపుర అగ్రహారం. నా భర్త గొంప అప్పారావు లారీ డ్రైవర్. మాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పాప స్పందనశ్రీ 4వ తరగతి చదువుతుంది. బాబు యశ్విన్ 2వ తరగతి చదువుతున్నాడు. మా ఇద్దరు పిల్లలు తల్లికి వందనం పథకానికి అర్హులుగా జాబితాలో పేర్లు వచ్చాయి. కానీ అందరికీ తల్లికి వందనం డబ్బులు వారి తల్లిదండ్రుల ఖాతాలలో జమయ్యాయి. మాకు మాత్రం ప్రాసెస్‌లో ఉందని, వస్తుందని చెబుతున్నారు కానీ ఇప్పటి వరకూ రాలేదు.



మీ సేవా కేంద్రంలో తల్లికి వందనం పథకం కోసం ఆరా తీస్తున్న లబ్ధిదారు

- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న తల్లిదండ్రులు
- ఫిర్యాదులకు ముగుస్తున్న గడువు
- నిబంధనల పేరుతో పథకానికి తూట్లు

సబ్బవరం: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చదువుకునే విద్యార్థులకు ఆర్థికంగా చేయూత అందిస్తూ వారి తల్లిదండ్రులను ప్రోత్సహించే విధంగా అమ్మ ఒడి కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు అనే వ్యత్యాసం లేకుండా అందరికీ అమ్మ ఒడి పథకం ద్వారా తల్లుల ఖాతాల్లో రూ.15 వేలు చొప్పున జమ చేసేది. అయితే కూటమి ప్రభుత్వం ఎన్నికల నాటి సూపర్ సిక్స్ హామీలలో భాగంగా చదువుకుంటున్న ప్రతి విద్యార్థికీ కుటుంబంలో ఎంత మంది ఉంటే అంత మందికి తల్లికి వందనం పథకం ద్వారా రూ.15 వేలు అందిస్తామని నమ్మబలికారు. తీరా అధికారం చేపట్టిన తర్వాత ఒక సంవత్సరం విద్యార్థులకు తల్లికి వందనం ఎగవేయడంతో పాటు నిబంధనల పేరుతో అధిక శాతం విద్యార్థులకు కోత విధించారు. విద్యుత్ వినియోగం 300 యూనిట్ల కంటే ఎక్కువగా ఉందని, సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించలేదనే కారణాలతో తిరస్కరించినవే అత్యధికంగా ఉన్నాయి. దీంతో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం కనిపించడం లేదు.

మండలంలోని సచివాలయాల వారీగా వివరాలు

సచివాలయం పేరు	దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు	అర్హులైన విద్యార్థులు	అనర్హులైన విద్యార్థులు
అంతకాపల్లి	443	370	73
ఆరిపాక	355	279	76
అసకపల్లి	562	496	66
బంగారమ్మపాలెం	415	383	32
బోదువలస	342	294	48
గొల్లలపాలెం	298	261	37
గొటివాడ	429	375	54
గుల్లేపల్లి	455	394	61
మల్లునాయుడుపాలెం	387	327	60
మొగలిపురం	306	246	58
నారపాడు-1	165	145	20
నారపాడు-2	394	373	21
పైడివాడ అగ్రహారం	556	463	93
సబ్బవరం-1	443	306	137
సబ్బవరం-2	233	160	73
సబ్బవరం-3	306	244	62
సబ్బవరం-4	518	436	82
తవ్వవానిపాలెం	227	187	40
వంగలి	465	407	59
అమృతపురం	339	266	73
మొత్తం	7,638	6,412	1,225

మండలంలో తల్లికి వందనం పథకం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు **7,638**

మండలంలో సచివాలయాలు **20**

మండలంలో పథకం కోసం అర్హులైన విద్యార్థుల సంఖ్య **6,412**

మండలంలో అనర్హులైన విద్యార్థుల సంఖ్య **1,225**